# ప్రకృతి సాగు.. దిగుబడి బాగు

- సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న మెట్ట రైతులు
- తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన దిగుబడులు
- రౌతులపూడి మండలంలో వెయ్యి ఎకరాల్లో సాగు


ఉప్పంపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట


రాఘవపట్నంలో జీడిమామిడిలో అంతర పంటగా గులిరాగి సాగు చేస్తున్న మహిళా రైతులు

**రౌతులపూడి:** కరోనా అనంతరం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజసిద్ధంగా పండించిన ఆహార పదార్థాలను ఎక్కువగా వినియోగించేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మెట్ట రైతులు పకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ఆరోగ్యానికి హాని కల్గించే రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా సహజ సిద్ధంగా తయారు చేసే ఎరువులను పంటలకు వినియోగిస్తున్నారు. ఆరోగ్యవంతమైన దిగుబడులతో పాటు అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

**చిరుధాన్యాలతో పాటు ఉద్యాన పంటలు**

రౌతులపూడి మండలంలో సుమారుగా వెయ్యి ఎకరాల్లో రైతులు పకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరితో పాటు రాగులు, కొర్రలు, జొన్నలు, గంట్లు వంటి చిరుధాన్యాలు, కందులు, మినుములు, పెసలు, బొబ్బర్లు, నువ్వులు వంటి పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా వంగ, మిరప, ఆనప, ఆకాకర, టమాటా, గుమ్మడి, బెండ, బీర, చిక్కుడు, గోరుచిక్కుడు, గులిరాగిబీర వంటి కూరగాయలు, తోటకూర, పాలకూర, మెంతుకూర, కొత్తిమీర, గోంగూర వంటి ఆకుకూరలను పండిస్తున్నారు. అలాగే పత్తి, అరటి వంటి వాణిజ్య పంటలను సైతం రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందుతున్నారు.

**పంటల సాగు వివరాలు**

రౌతులపూడి మండలంలో 620 ఎకరాల్లో వరి, 80 ఎకరాల్లో రాగులు, కొర్రలు, జొన్నలు, గంటులు, 62 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, 95 ఎకరాల్లో పత్తి, 125 ఎకరాల్లో జీడిమామిడి తోటలను రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేస్తున్నారు.

**స్వయంగా ఎరువుల తయారీ**

రసాయన ఎరువులకు స్వస్తి పలికి సహజసిద్ధమైన ఎరువులను రైతులే స్వయంగా తయారు చేసుకోవడంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. సహజసిద్ధమైన ఘనామృతం, బీజామృతం, ద్రవజీవామృతం, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు, పోషక లోపాల నివారణకు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం వంటి వాటిని ఎరువులుగా పంటల సాగులో వినియోగిసున్నారు. సేంద్రియ ఎరువులతో పెట్టుబడి తగ్గి అధిక ఆదాయం, ఆరోగ్యకరమైన పంటలను పొందుతున్నామని రైతులు చెబుతున్నారు. సాధారణ విధానంలో వరిలో ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి పెడితే 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తోందని, ప్రకృతి వ్యవసాయంలో ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే 30 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు వివరించారు.

**ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన**



గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ప్రకృతి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యత కల్గిన పంటలను సాగు చేస్తున్నారు. సమాజానికి ఆరోగ్యకరమైన పంటలను అందించడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం మండలంలోని మహిళా రైతులు తమ ఇంటి వద్ద కిచెన్ గార్డెన్ పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి.

– దాడి వరలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్, రౌతులపూడి మండలం

## ముద్రగడను కలిసిన చంటిబాబు


కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన జ్యోతుల చంటిబాబు

**కిర్లంపూడి:** మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు ముద్రగడ పద్మనాభంను మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిశారు. కార్యక్రమంలో దోమాల గంగాధర్, బండారు రాజా, ఇళ్ల అప్పారావుకాపు, కంచి లక్ష్మణదొర, బొద్దిరెడ్డి చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వర్క్‌షాప్

**గండేపల్లి:** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గూగుల్ ఫ్లట్టర్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సారథ్యంలో నిర్వహించిన స్టూడెంట్ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఫౌండేషన్ సర్టిఫికేషన్ కార్యక్రమం ముగిసిందని వివరించారు.

## క్లుప్తంగా

### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


అవార్డు గ్రహీత వీర్రాజును సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

**ఏలేశ్వరం:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొవ్వాడ వీర్రాజును పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. మాల మహానాడు ఆధ్వర్యంలో వీర్రాజును శాలువా, పూలమాలతో సత్కరించారు. విధి నిర్వహణలో వీర్రాజు సేవలను ప్రశంసనీయమన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వీర్రాజు మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పేకల జాన్, గుండుబిల్లి చక్రం, మద్దెల రమణ, థామస్, రేబాక నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆటో కార్మికులకు బియ్యం పంపిణీ

**గోకవరం:** మండలంలోని ఆటో కార్మికులకు శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో తన ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ నేతల సమావేశం

**గోకవరం:** స్థానిక ఠాణాసెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బయ్యవరపు రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ మండల, గ్రామ కమిటీల నియామకం కోసం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీకి పర్యవేక్షకుడిగా గరబారపు శ్రీనివాస్, సభ్యులుగా చాపల సూరిబాబు, మద్దాల శ్రీను, కొల్లి ముసలయ్య, చింతాటి గణేష్, కుందేటి గంగాధర్‌లను నియమించారు. కార్యక్రమంలో రవికుమార్, జుత్తల శ్యామ్, ములపర్తి నాగేశ్వరరావు, తోలేటి రాంప్రసాద్, బొడ్డపాటి వీరచంద్రం తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన


తంటికొండ వెంకన్న ఆలయంలో అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

**గోకవరం:** బాల్య వివాహాల నిర్మూలనపై చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సోషల్ వర్కర్ కరిబండి రాజు మాట్లాడుతూ దేశాన్ని బాల్యవివాహాల రహిత దేశంగా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, చర్చి పాస్టర్లు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఏర్పరచుకోవాలి

**గండేపల్లి:** విద్యార్థులు ఉన్నత ఆశయాలు, లక్ష్యాలను ఏర్పరచుకోవాలని కాకినాడ జేఎన్‌టీయూకే ప్రొఫెసర్, ఫార్మర్ వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో జాయ్ ఆఫ్ ఇంజనీరింగ్ అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎటువంటి ఆశయాలు, లక్ష్యాలను ఏర్పరచుకోవాలో వివరించారు. కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తెలివితేటలు అంటే జ్ఞానాన్ని ఆచరణలో అన్వయించగల సామర్థ్యం అని, జ్ఞానమంటే సమాచారం కాదని, ఒక పరివర్తన అని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### 45 మంది జూదరులకు జరిమానా

**గండేపల్లి/జగ్గంపేట:** గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 45 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.300 చొప్పున రూ.13,500 జరిమానా విధించినట్టు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కక్షిదారులకు రాజీయే రాజమార్గం


బ్యాంకు సిబ్బందికి అవార్డు కాపీ అందజేస్తున్న న్యాయమూర్తి గోపీనాథ్

**ప్రత్తిపాడు:** కక్షిదారులకు రాజీయే రాజమార్గమని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు క్షణికావేశాలకు గురై గొడవలు పెట్టుకోద్దని సూచించారు. చిన్నచిన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం మేలు అని తెలిపారు. కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన పేదలు, ఎస్సీ, ఎస్టీలు, వృద్ధులకు ఉచిత న్యాయ సేవలను అందిస్తామని తెలిపారు.

**లోక్ అదాలత్‌లో 86 కేసుల పరిష్కారం**

ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి గోపీనాథ్ 86 కేసులను పరిష్కరించారు. రెండు మనోవర్తి, ఒక గృహహింస కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4 లక్షలు ఇప్పించారు. 28 ఐపీసీ కేసులు, రెండు ఎక్సైజ్ కేసుల ద్వారా రూ.11,500, ఎనిమిది సివిల్ కేసులను పరిష్కరించడం ద్వారా రూ. 23.49 లక్షలు, ఒక చెక్ బౌన్స్ కేసులో రూ.లక్ష, 10 బీఎస్ఎన్ఎల్ కేసుల్లో రూ.13,014 ప్రతివాదుల నుంచి వాదులకు ఇప్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, బెంచ్ మెంబర్ కూసుమంచి సూర్యప్రకాష్, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యదేవుని దర్శించిన ఐటీ డైరెక్టర్ జనరల్


ఐటీ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వరి బెహరాకు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈఓ సుబ్బారావు

**అన్నవరం:** ఇన్ కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వరి బెహరా (ఏపీ, తెలంగాణ, ఒడిశా జోన్) శనివారం కుటుంబ సభ్యులతో కలసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.రాములు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించారు.

## బాధిత కుటుంబాలకు దాడిశెట్టి రాజా పరామర్శ


శృంగవృక్షంలో అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు

**తొండంగి:** మండలంలోని శృంగవృక్షం, తొండంగి గ్రామాల్లో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా శనివారం పరామర్శించారు. శృంగవృక్షంలో రిటైర్డ్ ఎస్సై యనమల అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను దాడిశెట్టి రాజా, పార్టీ నేత యనమల కృష్ణుడు పరామర్శించారు. తొండంగిలో వైఎస్సార్ సీపీ నేత రౌతు శివ తల్లి రౌతు రాఘవమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అలాగే పెదిరెడ్ల చంటబ్బాయి ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదే గ్రామంలో పలు ప్రమాదాల్లో గాయపడిన కె.అనీల్‌యాదవ్, బోనబోయిన సాయి, మురాలశెట్టి నాగ వెంకటరమణలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, మురాలశెట్టి చిట్టబ్బాయి, మురాలశెట్టి సత్యనారాయణ, పెదిరెడ్ల సురేష్, ఎలిశెట్టి గిరి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంగుళూరి సుశీలారాణి, యూత్ కన్వీనర్ పప్పల వెంకట్, పెదపూడి రమణ, పారేపల్లి సురేష్, పేకేటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు గిరిబాబు పరామర్శ


ములగపూడిలో సతీష్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

**రౌతులపూడి/అన్నవరం:** మండలంలోని ములగపూడిలో మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్‌కుమార్ సోదరుడు రామకృష్ణ శనివారం మృతి చెందారు. అయన భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సందర్శించి సంతాపం తెలిపారు. పార్టీకి ఎనలేని సేవలందించిన రామకృష్ణ మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, పార్టీ రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అలాగే అన్నవరంలో పార్టీ నేత రాయవరపు తాతారావు భార్య దేవుడమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ముద్రగడ గిరిబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. తాతారావు కుమారులు సత్యనారాయణ, వేంకట రమణలను ఓదార్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ధర్మవరంలో బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న మురళీకృష్ణంరాజు

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఆకుల వీరబాబు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల బాబులు, నానిపల్లి చంటి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, తూపాటి బాబ్జి, దొడ్డిపట్ల కృష్ణ, జువ్వల దొరబాబు, దాడి పుత్రయ్య, నాగులపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


కిర్లంపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న గిరిబాబు


ఏలేశ్వరం అన్నసమారాధనలో భక్తులు

**కిర్లంపూడి:** ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా కిర్లంపూడి సంతమార్కెట్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గిరిబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**గ్రామాల్లో అన్నసమారాధనలు**

**ఏలేశ్వరం:** గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని శనివారం పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక పెద్ద వీధిలోని పశువుల ఆసుపత్రి వద్ద, మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, లింగంపర్తి రోడ్డు తదితర ప్రాంతాల్లో అన్నదానాలు చేశారు. పట్టణంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, యిజనగిరి శివప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దోషులను తక్షణమే అరెస్టు చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న శివ గణేష్

**గోకవరం:** స్థానిక బంగాళాపేటలో ఇద్దరు యువకులు మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటన కలిచివేసిందని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట కో ఆర్డినేటర్ మరోతి శివగణేష్ అన్నారు. ఈ మేరకు బంగాళాపేటలోని బాధిత కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుర్ఘటనకు పాల్పడిన దోషులను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫండ్స్ నుంచి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఇప్పటికీ బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమన్నారు. పది రోజుల్లో న్యాయం జరగకపోతే బాధితులతో కలిసి నిరసనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీసీసీ జనరల్ సెక్రెటరీ నక్కా సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు గుర్రాల రత్నాలరావు, ఎస్సీ సెల్ నాయకులు కొండా శ్రీను, బెల్లం బాపిరాజు, మసారపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


జి.కొత్తపల్లిలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

**శంఖవరం:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

## పోతులూరు సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

**ప్రత్తిపాడు:** మండలంలోని పోతులూరు గ్రామ సర్పంచ్ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు పంచాయతీ నిధులు రూ.38,64,643 దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై అధికారులు ప్రాథమిక విచారణ అనంతరం మూడు నెలల క్రితం సర్పంచ్ రాంబాబు చెక్ పవర్ రద్దు చేశారు. ప్రస్తుతం సర్పంచ్ చెక్ పవర్‌ను పునరుద్ధరించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం తెలిపారు.

## పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు

**గండేపల్లి:** పిచ్చికుక్క ఎనిమిది మందిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం రాత్రి మల్లేపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లేపల్లి–ఉప్పలపాడు మార్గం మీదుగా పిచ్చికుక్క మల్లేపల్లి వైపు వస్తూ బ్రిడ్జి వద్ద ఒకరిపై దాడి చేసింది. మల్లేపల్లి కొత్తూరు సెంటర్ సమీపంలో మరో ఏడుగురిపై దాడి చేసి గాయపరిచింది. వీరిలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులకు జె.రాగంపేట సీహెచ్‌సీలో వైద్య సేవలు అందించినట్టు సీహెచ్‌సీ డాక్టర్ ప్రణీత్ తెలిపారు.

## చినుకు.. పత్తి రైతు వణుకు


చామవరంలో పూత, పిందె, కాయలతో ఉన్న పత్తి పంట

**తుని రూరల్:** ఈ ఏడాది పత్తి చేలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ తరుణంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, కాయలపై ఉన్న చేల నుంచి ఈ నెలాఖరుకు పంట చేతికి అందుతుంది. ఈ దశలో వర్షాలు కురిస్తే ఆరుతడిగా సాగయ్యే పత్తి చేలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్‌లోని ఐదు మండలల్లో 1778 హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. అత్యధికంగా తుని, రౌతులపూడి మండలాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. వాతావరణం అనుకూలిస్తే దసరా ఉత్సవాలు తర్వాత పత్తి సేకరణ చేపట్టే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

## గోతులు..రాకపోకలకు వెతలు

- ఛిద్రమైన రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా ఉన్న ఎస్.అన్నవరం, జగనన్న కాలనీ- చామవరం రోడ్డు

**తుని రూరల్:** చినుకు పడితే ఆ రహదారిలో ప్రయాణం నరకయాతనే. రెండు కిలో మీటర్ల రోడ్డే అయినా గుంతలు పడి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుని మండలం ఎస్.అన్నవరం నుంచి జగనన్న కాలనీ, చామవరం రోడ్డు ప్రమాదకరంగా మారింది. జగనన్న కాలనీలో 1100 కుటుంబాలకు ఇళ్లస్థలాలు ఇవ్వడంతో 50 శాతం మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. మరికొంత మంది ఇళ్ల నిర్మించుకుంటున్నారు. రోజు వేలాది మంది కాలనీవాసులే కాకుండా తుని నుంచి చామవరం వెళ్లేందుకు దగ్గర మార్గం కావడంతో రైతులు, వివిధ పనులపై వచ్చిన కూలీలు ఇదే రహదారిలో వెళ్తుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరడం, రోడ్డు జారిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటో డ్రైవర్లు కొంత మంది గ్రావెల్ వేసి రాకపోకలకు అనువుగా మార్చారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని కోరుతున్నారు.

**గోతులమయంగా తుని–నర్సీపట్నం రోడ్డు**

**కోటనందూరు:** మండలంలోని టీజే నగరం నుంచి జిల్లా సరిహద్దుల ప్రాంతం వరకూ తుని–నర్సీపట్నం రోడ్డు గోతులమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు అడుగడుగునా పెద్దపెద్ద గోతులు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గతంలో మొక్కుబడిగా పూడ్చిన గుంతలు వర్షాలకు తిరిగి పెద్ద గుంతలుగా రూపాంతరం చెందాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


కాకరాపల్లి శివారులో తుని-నర్సీపట్నం రోడ్డుకు పడిన గుంత